క్లుప్తంగా

జననేత జగన్‌ను కలిసిన అభిమాని పండు



పులివెందులలో మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని కలిసిన కొమిరేపల్లి వైఎస్సార్‌సీపీ నేత గంటా పండు

దెందులూరు: అభిమానం జిల్లాలు దాటి పులివెందుల వెళ్లేలా చేసింది. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చూసేందుకు మండలంలో కొమిరేపల్లికి చెందిన ఆయన అభిమాని, వైఎస్సార్‌సీపీ నేత గంటా పండు సోమవారం పులివెందులలో జగన్ క్యాంపు కార్యాలయానికి వెళ్లారు. ఏలూరు జిల్లా దెందులూరు నియోజకవర్గం నుంచి వచ్చానని చెప్పగానే ఎంతో ఆప్యాయంగా పలకరించారని గంటా పండు సంతోషం వ్యక్తం చేశారు. తన అభిమాన నాయకుడ్ని కలవడం చాలా సంతోషంగా ఉందని, ఇలాంటి సంఘటనను మరువలేనని పండు అన్నారు.

ఉత్సాహంగా 'నేను బడికి పోతా'



ఏపూరులో నేను బడికి పోతా కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు

పెదపాడు: చిన్నారులను తప్పనిసరిగా బడిలో చేర్పించాలని జిల్లా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రాధాకృష్ణ తల్లిదండ్రులకు సూచించారు. పెదపాడు మండలంలోని ఏపూరు గ్రామ పంచాయతీ తిమ్మనవీడు కాలనీలో సోమవారం ఉత్సాహంగా 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. 24, 25 తేదీల్లో బడి బయట ఉన్న పిల్లలంతా బడిలో చేర్పించేలా చర్యలు తీసుకోవాలని రాధాకృష్ణ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన అధికారులు పాల్గొన్నారు. తొలుత పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు గ్రామస్తులు, విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు



పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో తేజరతన్

పెదపాడు: గ్రామాల్లో సీజన్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పెదపాడు ఎంపీడీవో జే తేజరతన్ తెలిపారు. పెదపాడు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో సీజన్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటి నివారణకు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని, డ్రెయినేజీల్లో పూడిక తొలగించాలని అన్నారు. దోమల నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పెదపాడు ఈఓఆర్డీ సూర్యకుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ పీఎస్ఆర్‌వీ ఎస్ఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై తనిఖీ

దెందులూరు: జాతీయ రహదారిపై సోమవారం ఎమ్మెల్యే చింతమనేని, ఏలూరు ఆర్‌డీఓ ఎస్‌కే ఖాజావలి, ఆర్అండ్‌బీ ఎస్ఈ, నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులు కలిసి ఉమ్మడి తనిఖీ చేసి పలు సమస్యలను గుర్తించారు. ఈ విషయాలపై నేషనల్ హైవే అథారిటీ అధికారులు, రెవెన్యూ అధికారులు నివేదికను పంపాలని స్థానికులు వివరించారు. క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, దెందులూరు టీడీపీ అధ్యక్షుడు ఇప్పిలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

క్రీడాకారిణులకు ఆర్థిక సాయం



క్రీడాకారిణులకు ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : ఇటీవల రాష్ట్ర స్థాయి బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ చాటిన ఏలూరు కస్తూరిబా బాలికల పాఠశాల క్రీడాకారిణులు ఏడుగిరికి రిటైర్డ్ హెచ్ఎం జిల్లా వీరభద్రరావు సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. క్రీడల్లో రాణించిన వారు శారీరకంగా, మానసికంగా బలంగా రూపుదిద్దుకుంటారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం జి.సునీత మాట్లాడుతూ బాలికలు చదువుతో పాటు క్రీడల్లో సైతం రాణించాలన్నారు. దాతలు, తల్లిదండ్రులు, శిక్షకుల సహకారంతో ఉన్నత శిఖరాలకు చేరాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు కె.మురళీకృష్ణ, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి



చేబ్రోలులో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రం వద్ద పారిశుద్ధ్య కార్మికులతో అధికారులు



గ్రామ పంచాయతీలో ఎస్‌డబ్ల్యూపీసీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిస్ట్రిక్ట్ కో-ఆర్డినేటర్ ప్రసంగిరాజు

- పటిష్టంగా పారిశుద్ధ్య అమలు చేయాలి
- జిల్లా కో-ఆర్డినేటర్ జి.ప్రసంగిరాజు
- చేబ్రోలులో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు పరిశీలన

ఉంగుటూరు: స్థానిక సంస్థల పాలకులు సంపూర్ణ పారిశుద్ధ్యానికి కృషి చేసి గ్రామాలను ఆదర్శవంతగా తీర్చిదిద్దాలని ఎస్‌డబ్ల్యూపీసీ జిల్లా కో-ఆర్డినేటర్ జి.ప్రసంగిరాజు అన్నారు. ఉంగుటూరు మండలంలోని చేబ్రోలు గ్రామ పంచాయతీలో (ఎస్‌డబ్ల్యూపీసీ) చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం షెడ్డును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రండే లక్ష్మీ సునీత, కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ చేబ్రోలు ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దడానికి సహాయ సహకారం అందించాలని ప్రసంగిరాజును కోరారు. ఈ నేపథ్యంలో వారు చేపడుతున్న పారిశుద్ధ్య పనులను వివరించారు. ప్రతిరోజు ప్రజల నుంచి సేకరించిన తడి, పొడి చెత్తను వేరు చేసి నిల్వ చేస్తున్నామన్నారు. తడి చెత్తతో రైతులకు అవసరమైన వర్మీకంపోస్టు తయారు చేస్తున్నామన్నారు. గ్రామాల్లోని పారిశుద్ధ్య సిబ్బందికి, రైతులకు లోకల్ ట్రైనింగ్ సెంటర్‌గా చేబ్రోలు ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డు ఉపయోగపడుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ప్రసంగి రాజు గ్రామంలో పర్యటించి సంపూర్ణ పారిశుద్ధ్య లక్ష్య సాధనకు తీసుకుంటున్న చర్యలను పరిశీలించారు.ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్డును సర్పంచ్, కార్యదర్శితో కలిసి పరిశీలించి పలు సూచనలు చేశారు. గ్రామంలో అమలు చేస్తున్న పారిశుద్ధ్య పనులు, ఎస్‌డబ్ల్యూపీసీ నిర్వహణపై అభినందనలు తెలిపారు. డీపీఆర్‌సీ ఎస్.భూషణం, పంచాయతీ సిబ్బంది, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్య అందించాలి

పెదపాడు: విలువలతో కూడిన విద్యను అందించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ఉపాధ్యాయులను ఆదేశించారు. పెదపాడు మండలంలోని అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు యు రాంప్రసాద్, గారపాటి రామసీత, మోరు శ్రావణి, లావేటి శ్రీనివాసరావు, గుత్తా అనీల్, బొమ్మి ప్రభాకరరావు, నాయకులు పావులూరి రామారావు, వేమూరి శ్రీనివాసరావు ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ, ప్రధానోపాధ్యాయురాలు టి.పుష్పావతి పాల్గొన్నారు.

నీట్ పరీక్షపై విచారణకు డిమాండ్

దెందులూరు: ఇటీవల నీట్ పరీక్షలో జరిగిన అవకతవకలపై విచారణ చేయించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం దెందులూరులో వారు మాట్లాడుతూ నీట్ పరీక్షలో జరిగిన అవకతవకల వల్ల మధ్య తరగతి, బడుగు బలహీన వర్గాల విద్యార్థులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రతిభకు ఏ రంగంలోనూ ఏ ప్రాంతంలోనూ అన్యాయం జరగకూడదని, కేంద్ర ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకుని ఈ అంశంపై విచారణ చేయించాలని కోరారు.

పల్లె ప్రాంతాల అభివృద్ధికి కృషి



ఉచితంగా కుళాయి ట్యాపులను అందిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

భీమడోలు: పల్లె ప్రాంతాల అభివృద్ధికి కట్టుబడి ప్రభుత్వం పని చేస్తుందని ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. పూళ్ల పంచాయతీ శివారు ఎంఎంపురం గ్రామంలో సోమవారం వివిధ అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. రూ.3 లక్షలతో నిర్మించిన డ్రెయినేజీ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. రూ.3లక్షలతో నిర్మించిన పేరంటాలు చెరువు ఇన్‌లెట్ రూములను ఆయన స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. మాజీ మంత్రి వట్టి వసంతకుమార్ జ్ఞాపకార్థం పెద్దిరెడ్డి వెంకన్న ఆర్థిక సాయంతో 150 కుటుంబాలకు ఉచిత మంచినీటి కుళాయి ట్యాపులను ఆయన అందజేశారు. సర్పంచ్ దాయం సుజాత, ఎంపీపీ కనుమాల రామయ్య, ఉపసర్పంచ్ హరి బ్రహ్మానాయుడు, ఎంపీటీసీ గంటా శ్రీనువాస్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై అధికారులతో సమీక్ష

ఉంగుటూరు: ఉంగుటూరు నియోజకవర్గంలో ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండేలా అధికార్లు నియోజకవర్గంలో పనిచేయాల్సి ఉందని ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు అన్నారు. సోమవారం ఉంగుటూరులో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీ రాజ్ ఇంజనీర్లు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్లతో వేర్వేరుగా ఆయన సమావేశాలు నిర్వహించి అభివృద్ధి పనులపై సమీక్షించారు. పంచాయతీరాజ్ డీఈ ఉప్పలపాటి శ్రీనివాసరావు, నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఏఈలు, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించండి

దెందులూరు: చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సోమవారం కొవ్వలి ఉన్నత పాఠశాలలో స్టూడెంట్స్ కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సర్పంచ్ ఇంటేటి మధులత, తహసీల్దార్ వి.జితేంద్ర, ఎంపీడీఓ శ్రీలత, ఎంఈఓలు కె.అన్నమ్మ, ఏపీఎస్‌పీ ప్రసాద్, పాఠశాల హెచ్ఎం జీఎస్ఎన్ఎల్‌వీ శర్మ, ఉపాధ్యాయులు, నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

దండు మారెమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే ధర్మరాజు

గణపవరం: గణపవరం గ్రామ దేవత దండు మారెమ్మ ఆలయంలో సోమవారం ఉంగుటూరు ఎమ్మెల్యే పి.ధర్మరాజు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత ఆయన తొలిసారిగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధానార్చకుడు ఎమ్మెల్యే ధర్మరాజుకు ఆశీర్వచనాలు అందజేశారు. ఈకార్యక్రమంలో జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు పాల్గొన్నారు.

ఉపాధి హామీలో అవకతవకలపై ఫిర్యాదు



భీమడోలులో ఉపాధి హామీ పథకపు పనులపై విచారణ చేయాలని ఫిర్యాదు చేస్తున్న దృశ్యం

భీమడోలు: ఉపాధి హామీ పథకంలో జరిగిన అవకతవకలపై విచారణ చేయాలని మండల స్థాయి అధికారులకు సోమవారం గ్రామస్తులు వినతి పత్రం అందించారు. భీమడోలు తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులను స్వీకరించారు. భీమడోలులో ఉపాధి హామీ పథకంలో భారీగా అవకతవకలు జరిగాయని, పని చేయని వారికి తప్పుడు మస్టర్లు వేసారని తహసీల్దార్ జి.వరహాలయ్య, ఎంపీడీవో స్వర్ణలతకు ఫిర్యాదు చేశారు. వివిధ గ్రామాల నుంచి ప్రజలు వివిధ సమస్యలపై ఫిర్యాదు చేశారు. డ్రెయినేజీ, వీధిలైట్లు తదితర అంశాలపై ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు ఈతకోట దుర్గబాబు, బాబి, శేషుగిరి, ఎం.సుబ్రహ్మణ్యం, దుంగా రమణ, గొట్టాపు సతీష్, కె.నాని, రామకృష్ణ పాల్గొన్నారు.

జాతీయ రహదారి సమస్యలపై దృష్టి సారించాలి



హైవే సమస్యలపై అధికారులతో మాట్లాడుతున్న జేసీ లావణ్యవేణి, చిత్రంలో ఎమ్మెల్యే చింతమనేని

ఏలూరు(మెట్రో): ఆరు లైన్ల జాతీయ రహదారి నిర్మాణంలో దెందులూరు నియోజకవర్గంలో గుర్తించిన సమస్యలపై జులై, 10వ తేదీలోగా పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జేసీ బి. లావణ్యవేణి అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశపు హాలులో దెందులూరు ఎమ్మె ల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి సోమవారం సాయంత్రం జాతీయ రహదారి, రోడ్లు, భవనాలు, రెవెన్యూ శాఖల అధికారులతో జేసీ సమీక్షించారు. ఈ సందర్భంగా జేసీ లావణ్యవేణి మాట్లాడుతూ జాతీయ రహదారి-16లో హనుమాన్ జంక్షన్ నుంచి గుండుగొలను వరకు దెందులూరు నియోజకవర్గ పరిధిలోని పెదపాడు, పెదవేగి, దెందులూరు మండలాల్లో నెలకొన్న పలు సమస్యలపై చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎమ్మెల్యే చింతమనేని మాట్లాడుతూ జాతీయ రహదారి-16లో 6 లైన్ల రహదారి నిర్మాణంలో దెందులూరు నియోజకవర్గంలో అవసరమైన ప్రదేశాల్లో బ్రిడ్జిలు, అండర్ పాస్‌లు, సర్వీస్ రోడ్లు, డ్రెయిన్లు, కల్వర్టులు నిర్మించలేదని, వీటిపై దృష్టి సారించాలని కోరారు. సమావేశంలో ఆర్అండ్‌బీ సూపరింటెండెంట్ ఇంజనీర్ జాన్ మోషే, ఆర్డీఓ ఎస్.ఎస్.కె.ఖాజావలి, హైవే సంస్థ అధికారులు, రెవెన్యూ, ఆర్అండ్‌బీ సిబ్బంది పాల్గొన్నారు.

డాక్టర్‌పై చర్యకు డిమాండ్

ఇద్దరు బాలురకు సంబంధించి వారి కాలికి చేసిన శస్త్ర చికిత్సలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన పత్తేబాదలోని ఆర్థోపెడిక్ డాక్టర్‌పై చర్య తీసుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని జేసీని కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (మీకోసం) కార్యక్రమంలో పెదవేగి మండలం వేగివాడ గ్రామానికి చెందిన చెలమాల నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆయన జేసీని కోరారు.

కొనసాగుతున్న సీపీఎఫ్ ఉద్యోగుల ఆందోళన



ధర్నా చేస్తున్న సీపీఎఫ్ ఉద్యోగులు

గణపవరం: గణపవరం సీపీఎఫ్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న పర్మినెంట్ ఉద్యోగులు తమ ఆందోళనను కొనసాగిస్తున్నారు. నియామక సమయంలో కంపెనీ యాజమాన్యం ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం సీపీఎఫ్ ఉద్యోగులు రాజమండ్రిలోని కంపెనీ గేటు 18వ రోజు ఆందోళన కొనసాగించారు. కంపెనీ యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చాలని, కంపెనీని తిరిగి ప్రారంభించాలని వారు నినాదాలు చేశారు. న్యాయం జరిగేవరకూ ఆందోళన కొనసాగిస్తామని వారు ప్రకటించారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి



ఇన్‌చార్జి కలెక్టర్ లావణ్యవేణికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఏలూరు (టూటౌన్) / (మెట్రో) : జిల్లాలోని రైతాంగ సమస్యలు పరిష్కరించి, రైతులను ఆదుకోవాలని కోరుతూ ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ తరుపున జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బి.లావణ్యవేణికి ప్రజాసమస్యల పరిష్కార వ్యవస్థ కార్యక్రమంలో ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు నిమ్మగడ్డ నర్సింహా, కార్యదర్శి కె.శ్రీనివాస్‌లు సోమవారం వినతి పత్రం అందజేశారు. జిల్లాలో రబీ ధాన్యం అమ్మిన రైతులకు రూ.240 కోట్లు బకాయి విడుదల చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన పెట్టుబడి సాయం రూ.20వేలు వెంటనే అందించేలా చర్యలు చేపట్టాలని, వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగింపునకు జారీ చేసిన జీఓ-22ను రద్దు చేయాలని కోరారు. పాడి రైతులకు లీటరుకు రూ.5 బోనస్ ఇవ్వాలని పేర్కొన్నారు. ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్‌ను రద్దుకు అసెంబ్లీలో చట్టం చేయాలని, సమగ్ర భూ సర్వేలో జరిగిన లోపాలను సరిచేసి ఖచ్చితమైన పట్టాదారు పాస్ పుస్తకాలు ఇవ్వాలని కోరారు. సమగ్ర పంటల బీమా పథకం తీసుకురావాలని, పంటల బీమా ప్రీమియం రాష్ట్ర ప్రభుత్వమే భరించాలని పేర్కొన్నారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి చేసి జిల్లాలోని రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు అందించేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ పథకంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసిత రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి, వడ్డీ లేని పంట రుణాలు, నష్టపరిహారాలు ఇవ్వాలని కోరారు. గ్రీన్ ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యలు పరిష్కరించాలని, హైవే నిర్మాణంలో సర్వీసు రోడ్డు ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కొబ్బరి కొనుగోలు కేంద్రాలు తెరవాలని, సీడ్ మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులకు విత్తన కంపెనీల నుంచి అగ్రిమెంట్స్ ఇప్పించాలని కోరారు. ఉద్యాన పంటల రైతులకు ఇవ్వాల్సిన సబ్సిడీ బకాయిలు అందించాలని, నూజివీడులో ఉద్యాన శాఖ కార్యాలయం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. చెరువుల ఆక్రమణలు తొలగించేలా చర్యలు చేపట్టాలని వారు కోరారు.

అగ్ని ప్రమాద బాధితులకు సహాయం



బాధితులకు సహాయం అందిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: మండల ప్రధాన కేంద్రమైన కొయ్యలగూడెంలో అగ్నిమాపక కేంద్రాన్ని ప్రభుత్వం నిర్మించాలని తూర్పుగోదావరి జిల్లా ఎస్సీ సెల్ కాంగ్రెస్ విభాగం చైర్మన్ బండి విజయభాస్కర్ పేర్కొన్నారు. ఇటీవల అంకాలగూడెం అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులను సోమవారం పరామర్శించారు. మూడు దశాబ్దాలుగా అగ్నిమాపక కేంద్రం కోసం కొయ్యలగూడెం మండల ప్రజలు పోరాడుతున్నప్పటికీ అది కార్యరూపం దాల్చలేదన్నారు. అగ్ని ప్రమాదాలు తరచూ సంభవిస్తుండడంతో ప్రజలు తీవ్రమైన నష్టాలను కష్టాలను ఎదుర్కొంటున్నారని, ముఖ్యంగా వర్జీనియా పొగాకు రైతులకు అగ్నిమాపక కేంద్ర ఏర్పాటు అవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి రూ.30వేలు విలువైన నిత్యావసర సామాగ్రిని కొనుగోలు చేసి అందజేశారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కూనపోము రాజారత్నం, గౌతు సత్యేంద్ర, టి.కుటుంబరావు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చండీ హోమం

జంగారెడ్డిగూడెం: స్థానిక విజయదుర్గమ్మ ఆలయంలో చండీహోమం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ అధ్యక్షతన ఆలయ ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు, వేద పండితులు సత్య, కిరణ్‌లు చండీహోమం నిర్వహించారు. ఈ హోమానికి ఉభయ దారులుగా జంగారెడ్డిగూడేనికి చెందిన దుగ్గిరాల వెంకట గోపాలరావు, మధు చంద్రశేఖర్, కొప్పుల వెంకట సీతమహాలక్ష్మి దంపతులు వ్యవహించారు. అనంతరం దూసనపూడి ఏడుకొండలు పద్మావతి దంపతులు వారి ఆర్థిక సహాయంతో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు, సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు గుడిమెట్ల యుగంధర్ ఉపాధ్యక్షుడు వందనపు అప్పలరాజు, ఉత్సవ కమిటీ అధ్యక్షుడు యర్రం ఉదయ్ కుమార్, సభ్యులు జల్లిపల్లి శివకృష్ణ, కర్పూరం తుకారం, తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ ధారణ తప్పనిసరి



హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: హెల్మెట్ ధారణ సురక్షిత ప్రయాణానికి సంకేతమని జంగారెడ్డిగూడెం సీఐ పి.రాజేష్ అన్నారు. జంగారెడ్డిగూడెంలో సోమవారం హెల్మెట్ ధారణపై వాహనదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలో వాహన తనిఖీలు నిర్వహించి హెల్మెట్ ధరించని వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ప్రతీ వాహనదారుడి కర్తవ్యమన్నారు. నిబంధనలు పాటిస్తే ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కార్లు నడిపే వారు సీటు బెల్టు ధరించడం తప్పనిసరని తెలిపారు. వాహన ప్రమాదాల్లో ఎక్కువ శాతం తలకు గాయాలు తగలడం వలన మృతి చెందుతున్నారన్నారు. ప్రమాద తీవ్రత తగ్గించేందుకు హెల్మెట్‌లు, సీటు బెల్టులు ఎంతో దోహదం చేస్తాయన్నారు. ఇటీవల కాలంలో వాహనదారులు సెల్‌ఫోన్ డ్రైవింగ్ ఎక్కువ చేస్తున్నారని, ఇది చాలా ప్రమాదమన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ చేస్తూ పట్టుబడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే మైనర్‌లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లితండ్రులు ఈ విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లేకపోతే భారీ జరిమానాలు, జైలు శిక్షను ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ట్రాఫిక్ ఎస్సై జె.రంగయ్య పాల్గొన్నారు.

వరి విత్తనాల పంపిణీ



కుక్కునూరు ఆర్‌బీకేలో వరి విత్తనాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కుక్కునూరు: గిరిజన రైతులకు ప్రభుత్వం 90 శాతం సబ్సిడీపై అందించే వరి విత్తనాలను సోమవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏవో బాలాజీ మాట్లాడుతూ మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 90 శాతం సబ్సిడీతో అందించే వరి విత్తనాలు అందుబాటులో ఉంచామన్నారు. బీపీటీ 5204, ఎంటీయూ 1061, 1064, 7029 ఈ నాలుగు రకాల వరి విత్తనాలు పొజిషన్ చేశామన్నారు. రైతులు కేవలం 10 శాతం రేటు చెల్లించి వరి బస్తాలు తీసుకెళ్లొచ్చని, ఒక రైతుకు గరిష్ఠంగా 5 బస్తాలు ఇస్తామన్నారు. బీపీటీ 5204 రకం 25 కేజీల బస్తా రేటు రూ.105, ఎంటీయూ 1061, 1064, 7029 రకాలు 30 కేజీల బస్తా రేటు రూ.120కు ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ విత్తన ఉత్పత్తి కార్యక్రమంలో 50 శాతం రాయితీతో ఎంటీయూ 1061 రైతులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. లబ్ధి పొందిన ప్రతీ రైతు ఈ-క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు. గిరిజన రైతులు మాత్రమే పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డ్‌ల నకలు, ఫోన్ నంబర్ తీసుకొని ఆర్‌బీకేలకు వెళ్లాలని తెలిపారు.

డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని వినతి

టి.నరసాపురం: దోమల నివారణకు డ్రైనేజీ వ్యవస్థ పటిష్ట పరచాలని టి.నరసాపురం సామాజిక కార్యకర్త, సింగరేణి కార్మిక నాయకులు ఎస్‌డీ నాసర్ పాషా కోరారు. ఈ మేరకు సోమవారం తహసీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో కె.జోగేశ్వరరావులకు వినతిపత్రం అందజేశారు. నాసర్‌పాషా మాట్లాడుతూ మండలంలో పారిశుద్ధ్య పనులు మెరుగుపరచాలని, వర్షాకాలంలో ఎర్ర చెరువు ముంపు నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. అబ్దుల్లా, స్థానికులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో భారీ వర్షం



జీలుగుమిల్లి-కామయ్యపాలెం రహదారిపై వాగు పొంగుతున్న దృశ్యం

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని మండలాల్లో సోమవారం తెల్లవారు జామున భారీ వర్షం కురిసింది. సుమారు 2 గంటల పాటు ఏకధాటిగా వర్షం కురవడంతో కొండవాగులు పొంగి పొర్లాయి. గుబ్బల మంగమ్మ గుడి రహదారి వెంబడి కాల్వలు, కేఆర్‌పురం వాగు, చింతకొండ వాగు, దోలుగండి వాగులు పొంగిపొర్లాయి. అదే విధంగా జీలుగుమిల్లి నుంచి కామయ్యపాలెం వెళ్లే రహదారిలో వాగు పొంగి పొర్లడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. గంట తర్వాత వాగులో ఉధృతి తగ్గి వాహనాల రాకపోకలు ప్రారంభమయ్యాయి.

మహిళపై దాడి.. కేసు నమోదు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని మంగిశెట్టిగూడెంలో ఒక మహిళపై దాడికి పాల్పడిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. సీఐ రాజేష్ తెలిపిన వివరాల ప్రకారం నల్లగోపు చిరంజీవి, శివపార్వతి, గోపిశెట్టి కనకదుర్గల మధ్య కొనాళ్లుగా గొడవలు జరుగుతోన్నాయి. కనకదుర్గ ఇంటి స్థలం విషయంలో ఇరు వర్గాల మధ్య వివాదం చోటు చేసుకుంది. ఈ వివాదంలో చిరంజీవి దంపతులు రాయితో కనకదుర్గపై దాడికి పాల్పడి గాయపర్చారు. విషయం తెలుసుకున్న జంగారెడ్డిగూడెం సీఐ రాజేష్, ఎస్సై జ్యోతి బాస్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని కనకదుర్గను జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి, చికిత్స అందించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రాజేష్ తెలిపారు.

వ్యభిచార గృహంపై దాడి

జంగారెడ్డిగూడెం: వ్యభిచార గృహంపై జంగారెడ్డిగూడెం పోలీసులు దాడులు నిర్వహించారు. సీఐ పి.రాజేష్ ఆధ్వర్యంలో సోమవా రం పట్టణంలోని రాజుల కాలనీలో వ్యభిచార గృహంపై నిర్వహించిన దాడుల్లో ఇద్దరు యువతులు, ఇద్దరు విటులు, నిర్వాహకురాలిని పోలీసులు అరెస్టు చేశారు. వీరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కొండ చిలువ హతం

టి. నరసాపురం: పుట్రేపులో 12 అడుగుల కొండచిలువ గ్రామస్తుల చేతిలో హతమయ్యింది. గ్రామానికి చెందిన రైతు ఇంటి సమీపంలో ఉన్న కోళ్ల గాబులో భారీ కొండ చిలువ ప్రవేశించి కోడి పుంజును మింగేస్తుంది. కోళ్ల అరుపులతో కుటుంబ సభ్యులు చూడగా కొండ చిలువ కనపడింది. దీంతో ప్రమాదం పొంచి ఉందని స్థానికుల సాయంతో దానిని హతమార్చారు.